## (ఉండిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 7-10-96)

*ప్రియమైన ఆత్మబంధువుల్లారా,*

మన శరీరంతో సంబంధం లేకుండా, చావుపుట్టుకలతో సంబంధం లేకుండా ఒక సద్వస్తువు అందరి హృదయాలలో తనంతట తానుగా ప్రకాశిస్తోంది. మనకి శరీరం ఏవిధంగా అయితే నేనుగా వ్యక్తమవుతోందో అదే విధంగా తన హృదయంలో ఉన్న సద్వస్తువు ఎవరికయితే నేనుగా వ్యక్తమయిందో వారిని సద్గురువు అంటారు. కేవలము రచనలు, ప్రసంగాలు చేసేవారు సద్గురువులు కాదు. తన హృదయంలో ఉన సత్య వస్తువును అనుభవంలోనికి తెచ్చుకొన్న వాడు సద్గురువు. తనకు అనుభవం లేనపుడు ఇతరులకు బోధించటం చాలా కష్టం. ఒకవేళ బోధించటానికి ప్రయత్నం చేసినా అది ప్రోపర్‌గా జరుగదు. అందువలన సద్గురువు అవసరం చాలా ఉంది. మన కష్టాలు, బాధలు, దుఃఖాలు ఇవి అన్నీ మనస్సు యొక్క కల్పితాలు. మనస్సు యొక్క కల్పితం కానిది ఒక్క సద్వస్తువు మాత్రమే. అది అందరి హృదయాలలో ఉంది. అది తెలుసుకొన్నవాడుసుఖపడతాడు, మరణాన్ని దాటి వెళతాడు. వాడిని మృత్యుంజయుడు అంటారు. మన హృదయంలో ఉన్న సద్వస్తువును తెలుసుకొంటే ఇంక తెలుసుకోవలసినది ఏమీ మిగలదు. దానికి మించిన వస్తువు లేదని అది తెలుసుకొన్న తరువాత నీకు తెలుస్తుంది. అది అన్ని వస్తువుల కంటే అతి పెద్దది, అతి సూక్ష్మమైనది కూడ.

అందరికి మనం ఎవరిమో మనం తెలుసుకోవాలనే సహృదయం ఉండదు. ఎవరికైతే సూక్ష్మబుద్ధి ఉందో, మంచితనం ఉందో, వివేకం ఉందో వారికి మాత్రమే వారు ఎవరో వారు తెలుసుకోవాలనే సంకల్పం కలుగుతుంది కాని అదరికి కలుగదు, కలగాలని లేదు. నీ హృదయంలో మరణం లేని వస్తువు ఉంది. అదే ఆత్మ, అదే గురువు, అదే ఈశ్వరుడు. నీకు అర్హత కలిగినపుడు నీ హృదయంలో ఉన్న సద్వస్తువే నీకు బోధించటానికి కాళ్ళు, చేతులు తొడుక్కొని వస్తుంది వాడే గురువు. మనం వెతికే వస్తువు ఎక్కడో దూరాన ఉందని అనుకొంటున్నాము. అది మాయ యొక్క ప్రభావం. ద్వైతబుద్ధి వలన అలాగ అనిపిస్తోంది. మనం వెతికే వస్తువు మన హృదయంలోనే ఉంది. అది ముందు మనకు అర్థం కావాలి. నీ హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికి బోధలు వినటం వలన వాటి ప్రభావం ఎంతోకొంత ఉంటుంది. విసుగు లేకుండా, విరామం లేకుండా వినటం వలన ఆ వస్తువును తెలుసుకోవాలనే కాంక్ష కలుగుతుంది. ధ్యానం చేసుకోవటం కూడా మంచిదే. ఏక వస్తువును చింతించగా, చింతించగా ఆ చింతించే మనస్సు నశిస్తుంది. మనస్సు ఎప్పుడైతే నశించిందో మనోమూలంలో ఉన్న వస్తువు నీకు తానుగా వ్యక్తమవుతుంది. బోధలకి, జపానికి, పూజకి, ధ్యానానికి, విచారణకి వీటి అన్నింటికి ప్రాముఖ్యత ఉంది. ఏది ఇచ్చే ఫలితం అది ఇస్తుంది. ఫలితం లేదని చెప్పటం లేదు. వీటి అన్నింటికంటే గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. గురువు అంటే ఆత్మే. అది మిమ్మల్ని అనుగ్రహించినపుడు ఇంక మీకు ఏది అడ్డు వస్తుంది. దాని అనుగ్రహం మీకు ఉన్నప్పుడు ఇంక అడ్డు వచ్చేవి ఏమీ ఉండవు.

మన హృదయంలో ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి మనకు ఏ బలహీనతలు అడ్డు వస్తున్నాయో ముందు మనం తెలుసుకోవాలి. అనుకరణ పనికిరాదు. మనం మందుల షాపుకు వెళ్ళినపుడు మన రోగానికి కావలసిన మందు కొనుక్కొంటాము కాని అన్ని మందులూ కొనుక్కోము. అలాగే ముందు మన బలహీనతలు తెలిస్తే దానికి సంబంధించిన విరుగుడు ఆలోచించుకొని ఆ బలహీనతల నుండి బయటపడాలి. మీకు ఏ బలహీనత ఉందో ఆ బలహీనత లేనివాడితో సహవాసం చేస్తే ఆ బలహీనత నశిస్తుంది. మీఅంతట మీరు ప్రయత్నం చేసి ఆ బలహీనతల నుండి బయటపడలేకపోతే సత్పురుషుల సహవాసం చేయటం వలన ఆ బలహీనతలు నెమ్మదిగా పోతాయి. సద్గురువు దగ్గర నుండి మనకు ఏదైనా సహాయం అందుతూ ఉంటే అది

మనకు తెలియాలి అని ఆయన అనుకోడు. ఎందుచేతనంటే గుర్తింపులు కోరుకొనే నేను అక్కడ లేదు.

భగవంతుడు మనకు తెలియకపోవటానికి కారణం మనకు భక్తి ఉంది గాని ఆ భక్తిలో ప్రేమ తక్కువగా ఉంది. మనకు ప్రేమ భక్తి ఉండాలి. భగవంతుని మీద ఆపుకోలేని ప్రేమ కలగాలి. అచంచలమైన విశ్వాసం కలగాలి. భగవంతుడు ఉన్నాడనే సజీవమైన విశ్వాసమే నీకు భగవంతుడిని పట్టి ఇస్తుంది. ప్రతీదానికి అనుమానం పెట్టుకోవద్దు. మన కంట్రోలర్ మన హృదయంలోనే ఉన్నప్పటికి మనకు తెలియకుండా మన వాసనలే అడ్డు వస్తున్నాయి. ఆయనను తెలుసుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తున్నప్పటికీ, నీ హృదయంలో ములగటానికి నీవు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఈ వాసనలు నీ మనస్సును పిలక పట్టుకొని నీ సహస్రారం లోనికి తీసుకొని వస్తున్నాయి. నీకు వైరాగ్యం లేకపోతే, అభ్యాసం చేయకపోతే ఈ వాసనలు నశించవు. నీ ప్రయత్నం వలననే ఈశ్వరుడు తెలియబడడు. నీ ప్రయత్నంతోపాటు ఈశ్వరానుగ్రహం ఉండాలి. నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు ఎరుకలోనికి వచ్చినపుడు, నీ సూక్ష్మబుద్ధికి అందినపుడు అది ప్రత్యక్షముగా నీకు తెలుస్తూ ఉంటుంది, చెప్పుడు మాటల మీద ఆధారపడనక్కరలేదు. అది ప్రత్యక్షానుభవం.

నేను కాలమును పాడు చేసుకొంటున్నాను అని ఒక భక్తుడు భగవాన్‌తో అన్నాడు. అసలు కాలం ఉంటే పాడు చేసుకోవచ్చు. కాలం లేకపోతే ఏమి పాడు చేసుకొంటావు. దాని అర్థం ఏమిటి అంటే కాలం ఎక్కడ ఉంది ? కాలం మనస్సులో ఉంది. చైతన్యంలో కాలం లేదు. నువ్వు చైతన్యానివే అయినపుడు కాలం గొడవ ఎందుకు. భగవంతుని తెలుసుకోవాలనే కాంక్ష నీ హృదయాంతరాళముల నుండి రావాలి గాని తెలియబడటం అనేది నాలుగు రోజులు వెనుకో ముందో తెలియబడుతుంది. మీరు ఏమీ తొందరపడవద్దు. మీకు శ్రద్ధ కలగాలి. శ్రద్ధ కలిగిన తరువాత జ్ఞానం రావటం ఇంక ఆగదు. జ్ఞానం వలన నీకు మోక్షం కలుగుతుంది. శాంతి కలుగుతుంది. అది అలౌకికమైన శాంతి. ఊహిస్తే అది నీకు అందదు. నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు తెలిస్తే శాంతి, మోక్షం వచ్చి నిన్ను వరిస్తాయి. ఎవరి అనుగ్రహం వలన నాకు జ్ఞానం కలిగిందో వారి అనుగ్రహం వలననే మీకు కూడా జ్ఞానం కలుగుతుంది అని చెప్పారు భగవాన్. గురువు అనుగ్రహం యొక్క వేగం మీ కళ్ళకు కనబడకపోవచ్చును కాని పరిణామంలో ఒక మెట్టు తరువాత ఒక మెట్టు మీకు తెలియకపోయిన ఆ మెట్టులను పొందుతూ ఉంటారు. మీ బుద్ధిలో మార్పు వస్తుంది. మీకు సూక్ష్మ బుద్ధి కలుగుతూ ఉంటుంది మీరు గమ్యం చేరుతూ ఉంటారు. ఎటువంటి బుద్ధి కలిగితే మీకు ఈశ్వరుడు తెలియబడతాడో అటువంటి బుద్ధిని ఆయనే ఇచ్చి ఆయనే మీకు దర్శనం ఇస్తాడు.

మన పనుల కోసం ఇతరుల మీద ఆధారపడకూడదు. ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. మన పనులు మనం చేసుకొంటూ ఖాళీ టైములో భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేస్తే ఇప్పుడే ఇక్కడే ఈ జన్మలోనే దానిని పొందవచ్చు. మనం పని చేసేటప్పుడు చేతిలో ఉన్న పనిని సరిగా చేయము. పని తక్కువగా చేస్తాము. దానికి సంబంధించిన ఫలితాన్ని ఎక్కువగా ఊహిస్తాము. దానివలన సంకల్పాలు ఎక్కువగా వస్తాయి. నీకు వచ్చే తలంపులు, ఆలోచనలు, నీవు చేసే పనులు నీ మనస్సును బాహ్యాముఖపరిచేవిగా ఉండకూడదు. నీ హృదయం యొక్క లోతులలోనికి తీసుకొనివెళ్ళేలాగ ఉండాలి. ఎవరైతే జ్ఞానం సంపాదించాలి అనుకొంటున్నారో వారు పైకి వెళితే తెలియదు. లోపలకు వెళితే వస్తువు తెలుస్తుంది. భగవదనుభవం కలుగకుండా ఏ అహంకారము అయితే అడ్డు వస్తోందో దానికి వెళ్ళే food supply ఆపుచేయండి. దానితో పేచీ అక్కరలేదు. మీ మాట ద్వారా, మీరు చేసే పని ద్వారా, మీ ఆలోచన ద్వారా మీ అహంకారము పెరగకూడదు. ఈ మూడింటి ద్వారా అహంకారమునకు food supply అవుతూ ఉంటుంది. ఈ మూడింటి ద్వారా అహంకారమునకు food supply అవ్వకుండా చేస్తే అహంకారము దాని అంతట అదే రాలిపోతుంది.

మీ పూజతోటి, ధ్యానంతోటి సంబంధం లేకుండా అహంకారము దాన్నంతట అదే నశిస్తుంది.

నేను పోతే enjoyment పోతుంది కదా ఇంక ఈ ఎచీవ్‌మెంట్సు ఏమి చేసుకొంటాము అని ప్రశ్న. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది నిజం కాదు, అది ఒక తలంపు. ఇది ఒక తలంపు కాబట్టి గాఢనిద్రలో మిగిలిన తలంపులు అణిగిపోయినపుడు ఈ నేను అనే తలంపు కూడా అణిగిపోతోంది. గాఢనిద్రలో ఇది మనకు తెలియకుండానే అణిగిపోతోంది. జాగ్రదావస్థలో నీవు సాధన చేసి ఈ నేను అనే తలంపును పోగొట్టుకొంటే నీ లోపల ఉన్న ఈశ్వరుడే నీకు నేనుగా వ్యక్తమవుతాడు. అది తలంపు కాదు. అప్పుడు enjoyment పోతుంది అని కంగారు పడకండి. దేహగతమైన నేను ఎప్పుడైతే పోయిందో నీ లోపల ఉన్న సత్యమే నీకు నేనుగా వ్యక్తమవుతుంది. అప్పుడు ఆ నేనే ఆ నేనును enjoy చేస్తుంది. ఆ రియాలిటీయే రియాలిటీని enjoy చేస్తూ ఉంటుంది. అప్పుడు enjoyment కోసం మిఠాయిలు తినక్కరలేదు, సినిమాలు చూడనక్కరలేదు ఎంతకాలం అయినా ఆ enjoyment మీకు విసుగు అనిపించదు. ఎప్పటికప్పుడు అది freshగా ఉంటుంది ఆ సుఖం స్వతంత్రముగా ఉంటుంది. ఊహలతో సరిపెట్టుకోవద్దు. ఆ వస్తువు పొందండి. అది మీకు తెలుస్తుంది.

చిన్న చిన్న విషయాల గురించి ఆందోళన చెందవద్దు. కర్మ ఫలం గురించి ఎక్కువ ఊహించవద్దు. చేసే పని హృదయపూర్వకంగా చెయ్యి. వచ్చేది వస్తుంది, రానిది రాదు. పని సరిగా చేయకుండా ఫలితం గురించి ఎక్కువ ఊహిస్తే సంకల్పాలు ఎక్కువ వస్తాయి. నువ్వు యోగివి కాలేవు. నీ స్వరూపానికి దూరమవుతావు. ఇంటిదగ్గర మిమ్మల్ని ఎవరైనా సరిగా చూడకపోతే వారికి మా మీద ఇష్టం లేదు అని అనుకోవద్దు. ఇటువంటి గొడవలలోనికి వెళ్ళవద్దు. నిజంగా మనం అంటే వారు ఇష్టపడితే వారి మీద మమకారం ఏర్పడుతుంది. మిమ్మల్ని ఇష్టంగా చూస్తే మీ మనస్సు దేవుని మీదకు వెళ్ళదు వారి మీదకు వెళుతుంది. అందువలన ప్రేమిస్తే 100 నమస్కారములు, మనలను ప్రేమించకపోతే 1000 నమస్కారములు. ఎందుచేతనంటే వారు మనలను ప్రేమించకపోతే మనస్సు ఇంక దేవుని పట్టుకొని ఉంటుంది. జ్ఞాని మాట, చూపు, చేత, శరీరం అన్నీ ఒకటిగా ఉంటాయి. ఏమీ సాధన లేకుండా గౌతమబుద్ధుని చూడటం వలననే కొంతమంది జ్ఞానులు అయినారు. అంటే ఆ శరీరం, చూపు, మాట, హృదయం సర్వస్వం జ్ఞానమే. జ్ఞాని శరీరాన్ని చూస్తూ ఉంటే మనకు ఆపుకోలేని ఆకర్షణ కలుగుతుంది. జ్ఞాని శరీరాన్ని చూస్తే జ్ఞానం సంపాదించాలనే కాంక్ష మనకు కలుగుతుంది.

గురువు మౌనంగానే ముందు బోధిస్తాడు. ఆ మౌనం నీకు అందనపుడు నీకు మాటలతో బోధిస్తాడు. ఆ మాట దేవుడై ఉన్నది. నోరు మూసుకోవటం మౌనం కాదు. మనస్సు మూసుకోవటం వలన మౌనం వస్తుంది. మనస్సు మూసుకోవటం నోరుమూసుకొన్నంత తేలిక కాదు. ఎక్కడ మనస్సు అణిగిందో అక్కడ మౌనం వస్తుంది. నీకు తెలుసున్నా, తెలియకపోయినా నీవు ఆత్మవే. నువ్వు ఎవడివో నీకు తెలిసే వరకూ మనిషి వెంట నీడ ఎలా ఉంటుందో అలా జన్మజన్మలకు దుఃఖము నిన్ను వెంటాడుతూ ఉంటుంది. నిజం తెలుసుకొనే వరకూ ఆ నిజం నిన్ను విడిచిపెట్టదు. ఇది నగ్న సత్యం. దేవుని మీద అకారణమైన ప్రేమ కలగాలి. అకారణమైన ప్రేమ ఎప్పుడైతే వచ్చిందో మన లోపల వాసనలు పెద్ద పెద్ద దుంగలంత ఉన్నప్పటికీ దేవునిపట్ల ఉన్న ఆ ప్రేమ ప్రవాహంలో ఆ దుంగలు అన్నీ కొట్టుకొనిపోతాయి. కేవలము నీ తెలివితేటల వలన వాసనలు నశించవు. భగవంతుని ప్రేమించటం వలన అవి నశిస్తాయి. సాధన, తెలివి అవసరమే కేవలం వాటి వలన వాసనలు నశించవు. ఈశ్వరానుగ్రహం అవసరము.

★